

Versatile Writer, Author Of
**"The Enemy of the Mankind" and**
**"The Dictator of the Dark"**
With Highest Number Of Records

# సూర్యదేవర రామ్ మోహన రావు

**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU**
**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS TRANSLETED INTO KANNADA**



# గాడ్స్ స్క్రీన్ ప్లే

# గాడ్స్ స్క్రీన్ ప్లే

సూర్యదేవర రామమోహనరావు

# గాడ్స్ స్క్రీన్‌ప్లే

-సూర్యదేవర రామ్‌మోహనరావు

**బ్రహ్మలోకం దివ్యకాంతితో మెరిసిపోతోంది...**

**పసిడి ముద్దతో రమణీయమైన ఆకృతిని కల్పించి, ఆ స్వర్ణ ప్రతిమవైపు కనురెప్పలార్పకుండా చూడసాగాడు సృష్టికర్త-**

**"ఎవరా ప్రతిమ" మందస్మిత పదనంతో అడిగింది ఆశ్చర్యంగా సరస్వతీదేవి.**

**"ఇంకా పూర్తి కాలేదు. ప్రాణప్రతిష్ట చేయాలి కదా.." దీర్ఘాలోచనుడై అన్నాడు బ్రహ్మ. సరస్వతి ఆయన చర్యల్ని గమనిస్తోంది.**

**బ్రహ్మ ఒక చేత్తో స్వర్ణకలశాన్ని అందుకుని అందులోని అమృతంతో మంత్రోచ్ఛారణ చేస్తూ శిరసాభిషేకం చేసాడు.**

**కొన్ని క్షణాల తర్వాత ఆ పక్కనే ఉన్న చిన్నబాలుని ప్రతిమను, ఆ పెద్ద ప్రతిమ ఒడిలో పెట్టాడు.**

**ఆ దృశ్యం చాలా విచిత్రంగా వుంది సరస్వతీ దేవికి....**

**నెమ్మదిగా ప్రతిమల్లో చలనం ప్రారంభమైంది.**

**ఆ పెద్ద ప్రతిమ ఒక మాతృమూర్తి-చిన్న ప్రతిమ ఆమె ఒడిలోని ఆమె బిడ్డ...**

"ఆకస్మాత్తుగా మాతృమూర్తి, తనయుల్ని సృష్టించారేమిటి?!" సరస్వతీదేవి మనసులో ఏదో సందేహం.

తల్లి ఒడిలోని ఆ బాలుడు పసిడి కాంతులీనుతూ ముద్దుగా వున్నాడు. ఒకసారి ఆ బాలుడ్ని, తన చేతుల్లోకి తీసుకొని, లాలించాలని ఆశపడిన సరస్వతీదేవి, గబుక్కున ముందుకెళ్ళి ఆ బాలున్ని తన చేతుల్లోకి తీసుకుంది.

సరిగా అదే సమయంలో-

తను సృష్టించిన జీవుల్ని, చరాచరలోకంలోకి పంపించాలనుకునే బ్రహ్మ, మాతృమూర్తి ప్రతిమను చేతితో తాకాడు మరుక్షణం ఆ ప్రతిమ అక్కడ నుంచి మాయమైపోయింది.

అప్పుడుగానీ బ్రహ్మ మనసులోని ఉద్దేశాన్ని తెలుసుకోకుండా తొందరపడి తను చేసిన తప్పిదాన్ని గుర్తించి కలవరపాటుతో బ్రహ్మ వైపు చూసింది సరస్వతీదేవి.

“నేను చరాచర మానవలోకంలోకి రెండు జీవుల్ని ఒకేసారి పంపాలనుకున్నాను. కానీ లలాగ లిఖితం– ఆ తల్లికి అందినట్లే అందిన మాతృప్రేమ తృటిలో చేజారిపోయింది...” అన్నాడు బ్రహ్మ.

“అంటే.... ఆమె మాతృప్రేమకు దూరమైపోయినట్టేనా..?” కలవరపడుతూ తల్లి హృదయంతో అడిగింది సరస్వతి.

“ఆ బాలుడ్ని మానవలోకంలోకి చేర్చడమే మన పని... ఆ తర్వాత జరిగేది... అనూహ్యం.... అగాధం... రహస్యం...” అన్నాడు బ్రహ్మ.

సరస్వతి దేవి నెమ్మదిగా తన చేతుల్లోని బాబుని జారవిడిచింది!

అర్ధనిమీలిత నేత్రుడై ఆ దృశ్యాన్ని వీక్షిస్తున్నాడు సృష్టికర్త బ్రహ్మ.

× × × ×

“బాబూ” కెవ్వున అరచిందామె.

ఒక దుస్వప్నం నుంచి తేరుకోడానికి ఆమెకు అరక్షణం పట్టింది. గబుక్కన బెడ్‌లైట్ స్విచ్ ఆన్ చేసింది. క్షణంలో మసక వెన్నెల కాంతి ఆ విశాలమైన గదిలో వ్యాపించింది.

వెంటనే లేచి కూర్చుందామె. నలువైపులా చూస్తూ బెడ్ మీంచి లేచి ఆ రూమ్‌లోనికి విసురుగా బయటికొచ్చి ఆ ప్రక్కనే ఉన్న రూమ్ తలుపును నెమ్మదిగా తోసి లోనికి చూసింది.

గది మధ్యలో–

చిన్ని చిన్ని బంగారు మువ్వలతో, వెండి ఉయ్యాల, ఆ ఉయ్యాలలో లోకంలో సుఖం, దుఃఖం, పగలు, రాత్రి భేదం లేని నెలల బాలుడు శేషునిపై నిద్రుస్తున్న బాల విష్ణువులా వున్నాడు.

దగ్గరగా వెళ్ళి బాబు ముఖాన్ని తినివితీరా తడిమి, చప్పుడు చేయ్యకుండా ముద్దు పెట్టుకుని, సున్నితమైన బుగ్గను, చేతులు, అరికాళ్ళ లేత ఎరుపు మెరుపును చూస్తూ తన్మయత చెందుతోందామె....

సరిగ్గా అదేసమయంలో నిద్రలో పక్కకు ఒరిగాడు ఆ బాలుడు. కప్పిన దుప్పటి పక్కకు జరిగింది. కుడిపైపు నడుముకు పై భాగంలో తేనెరంగులోని పెసర బద్ధంత పుట్టుమచ్చ లైటుకాంతిలో మెరుస్తూ కనిపించింది. దుప్పటిని గుండెల వరకూ కప్పి, దుస్వప్నపు నీడలో అంతవరకూ కమిలిపోయిన హృదయాన్ని సేద బరచుకుంటోందామె.

ఏదో చిన్న చప్పుడైతే గబుక్కున తలతిప్పి చూసింది. అంతవరకూ దూరంగా నేలమీద పడుకున్న ఆయా కంగారుగా పాలసీసాతో వచ్చింది.

“అమ్మా! ఇంత అర్ధరాత్రి మీరొచ్చారేమిటి? బాబు ఏడ్చాడా?” కంగారుగా పడుతూ అడిగిందామె.

“లేదు… నిద్రపట్టలేదు… అందుకే…” తన కలవరపాటును కప్పిపుచ్చుకుంటూ అందామె.

“మీరెళ్ళండమ్మా…. నేను చూసుకుంటాను…” ఉయ్యాలను చిన్నగా వూపుతూ అంది ఆయా.

బాబు ముఖంలోకి ఒక్కసారి చూసి నెమ్మదిగా వెనుదిరిగింఇ ఆమె. ఆమె పేరు సుదేష్ణాదేవి.

నలభై అయిదేళ్ళ సుదేష్ణాదేవి పిల్లల కోసం నోచని నోము, చేయని వ్రతం, తిరగని పుణ్యక్షేత్రం లేదు. ఇచ్చిన దానాలకు అంతులేదు. పెళ్ళయిన పాతికేళ్ళకి గాని ఆమె తల్లి కాలేకపోయింది. మాతృత్వపు మాధుర్యాన్ని మనసారా అనుభవించగలిగే అదృష్టం అప్పటికి గాని ఆమెకు దక్కలేదు.

శరీర తత్వం దృష్ట్యా ఆమెకు మరిక పిల్లలు కలగడానికి ఆస్కారం లేదని డాక్టర్లు చెప్పేసారు.

అంచేతే వరంలా పుట్టినాడే ఆమెకు సర్వస్వం అయిపోయాడు.

బాబు పేరు తేజ–తేజేశ్వర ప్రసాద్. తాతగారి పేరు. ఆ పేరే వాడికి పెట్టారు.

× × × ×

విశాలమైన బెడ్‌రూమ్‌లో బెడ్‌మీద స్వర్ణ ప్రతిమలా దీర్ఘాలోచనరాలై కూర్చుంది సుదేష్ణాదేవి.

బిజినెస్ మీటింగ్ కోసం బొంబాయి వెళ్ళిన భర్త కాళేశ్వరప్రసాద్ ఫోన్ కోసం రాత్రి నిద్రపోయే వరకూ ఎదురు చూసిందామె.

ఎక్కడున్నాసరే ప్రతి మూడుగంటల కొకసారి ఫోన్ చేసి కొడుకు యోగక్షేమాలడిగి, ఆ చిన్ని నవ్వును ఫోన్ ద్వారా వినే ఆ భర్త కాళేశ్వరప్రసాద్ రెండ్రోజులుగా ఒక్క ఫోనైనా ఎందుకు చెయ్యలేదు?

రూమ్‌లో నెమ్మదిగా ప్రవహిస్తున్న ఎ.సి. చప్పుడు, ఎక్కడో గోడగడియారం కొట్టిన గంటల చప్పుడు…

మూడు గంటలు….

ఎప్పుడూ చిన్నారి తేజ నవ్వు, నడక, అల్లరి కల్లోకి వచ్చే ఆమెకు మొట్టమొదటిసారి తన ఒడిలోనుంచి కిందకు అగాధంలోకి జారిపోయిన కల. ఆ కలను మళ్ళీ జ్ఞాపకం చేసుకోడానికి కూడా ఆమెకు భయంగా వుంది.

కుడివైపు గోడకు నిలువెత్తు షిర్డీసాయిబాబా చిత్రపటం. ఆ చిత్రపటం ఎదురుగా నిలబడి చేతులు ముకుళించిందామె.

తండ్రీ…. నోచిన నోములకు వరప్రసాదంలా, అపురూప కానుకగా ఇచ్చిన నా చిన్నారి తేజను నా నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ దూరం చేయకు…. ఆ గుండె కోతను నేను భరించలేను… మాతృత్వపు మమతతో నిండుతున్న ఈ మనసు అమృత భాండాన్ని విచ్ఛిన్నం చేయకు తండ్రీ… లిప్తకాలం కూడా

వాడికి దూరంగా నేను బతకలేను... వాడ్ని దూరం చేసి నన్ను జీవచ్ఛవంలా మిగల్చకు తండ్రీ... మనసారా వేడుకుంది సదేష్ణాదేవి.

అప్పటికి గానీ ఆమె మనసు కుదుట పడలేదు.

అయినా చిన్న కలకు తనెందుకు ఇంతగా భయపడుతోంది..? అకస్మాత్తుగా అంకురించిన ప్రశ్న. ఆ ప్రశ్నకు జవాబును తల్లి హృదయం మాత్రమే చెప్పగలదు.

తన మమతను పంచడానికి, ప్రతి చోటుకు వెళ్ళలేక తల్లిని సృష్టించిన దేవుడు....

ఆ తల్లి హృదయానికి గాయం చేస్తాడా? ఆ ఆలోచన సుదేష్ణాదేవికి చాలా ఓదార్పుగా వుంది. అంతవరకూ మనసు పొరల్లోకి చేదులా ప్రాకిన బాధ, ఒక్కసారిగా తొలగిపోయింది.

కళ్ళెదురుగా చిన్నారి తేజ! మెరిసే పాల బుగ్గలతో, విరిసే పాల నవ్వులతో... వాడు తన గుండెలమీద చప్పుడు చెయ్యకుండా నడుస్తున్నప్పుడు హృదయంలో పడిన–

అనురాగముద్రలు.... ఆత్మీయ స్పర్శ....

నెమ్మదిగా సుదేష్ణాదేవి కనురెప్పల మీదకి నిద్ర తెరలా వాలింది.

× × × ×

అయ్యయ్యో! చేతిలో డబ్బులు పోయెనే!

అయ్యయ్యో! జేబులు ఖాళీ ఆయనే, దూరంగా టీ షాపులోంచి పెద్ద సౌండ్‌తో విన్పిస్తోందా పాట.

ఒక ఆటో ఝామ్మంటూ సీరియస్‌గా వచ్చి కాచిగూడ పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది.

“ఇస్టేషన్‌కి వచ్చినమ్ బిడ్డా... దిగుండ్రీ...” యాభై ఏళ్ళ ఆటోవాలా చెప్పాడు. ఆటో వెనక సీట్లో ముగ్గురు వ్యక్తులు కిక్కిరిసి కూర్చున్నారు. అందులో ఒకడు తలవొంచి చూద్దామనుకున్నాడు వీలుకావడం లేదు...

“ఒరే సేతురాజు అందుకే అడ్డమైనగడ్డీ తినొద్దనేది. చూడు ఇనప డ్రమ్ము కూలబడినట్టు కూలబడ్డావ్... రేయ్.... కాలు ముందుకు జరపరా... నీ కాలు కింద నా వేలు పడిపోయింది...” కీచుమంటూ అన్నాడు పోతురాజు.

“లేకపోతే మీలా గాలికి ఊగిపోయే జెండా కర్రల్లా ఉండాలంట్రా...? స్టేషనొచ్చింది... మళ్ళీ ట్రైన్ వెళ్ళిపోతుంది... డబ్బులిచ్చెయండి...” అన్నాడు సేతురాజు.

“మైడియర్ మ్యాడ్ బ్రదర్స్.... దిసీజ్ నాట్ రైల్వేస్టేషన్. దిసీజ్ పోలీస్‌స్టేషన్. ఒరేయ్ ఆటో యంగ్ డ్రైవర్ బ్రదర్.... ఇక్కడకు తీసుకొచ్చావేంటీ....?” కంగారుపడుతూ అడిగాడు వీర్రాజు.

“కాచిగూడ స్టేషన్ అన్నారా లేదా… మీ మోహాలు చూడగానే అర్థమైపోయింది… ఏ స్టేషనో…. దిగండి… దిగండి….” ఆటో డ్రైవర్ జవాబిచ్చాడు చిరాగ్గా.

“ఒరేయ్ ఆటోరావుడూ… అర్జంటుగా మమ్మల్నిక్కడ్నించి తోలుకెళ్ళిపోరా… అసలే నాకు పోలీస్‌స్టేషనంటే చిరాకు” బ్రతిమాలుతున్నట్లుగా అన్నాడు పోతురాజు.

“ఇక్కడ నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కి తీసుకెళ్ళాలంటే పది రూపాయలు ఎగస్ట్రా అవుతుంది. తీసుకెళ్ళనా?”

“పదా!” దీర్ఘం తీసాడు సేతురాజు.

“ఇక్కడికి సానా దూరం అది…” చెప్పాడు ఆటోడ్రైవర్.

“వాడితో గొడవెందుకు, ముందు మనం ఇక్కడ నుంచి పోదాం…. పోనీ యంగ్ బ్రదర్…” సామరస్యంగా అన్నాడు పోతురాజు.

ఆటోడ్రైవర్ చిద్విలాసంగా నవ్వాడు.

పక్కనే ఉన్న రైలేస్వేషన్ కనబడకుండా, గేరుమార్చి కుమార్ థియేటర్ వైపు ఆటోను తిప్పి స్పీడ్ పెంచాడు.

ఆటో సర్రుమని ముందుకు దూసుకుపోయింది.

“యంగ్ ఆటోడ్రైవర్ నాదో చిన్న డౌటు… కాచిగూడ పోలీస్‌స్టేషన్ పక్కనే రైల్వేస్టేషన్ కూడా ఉందని నాంపల్లి స్టేషన్‌లో చెప్పారే… నువ్వేంటీ…. ఇటెటో తీసికెళ్తున్నావ్…. మమ్మల్ని గాని మోసం చెయ్యాలని చూస్తున్నావా…?” చాలా తెలివిగా ఒక్క ప్రశ్న వేసానని తనతో తానే మురిసిపోతూ అడిగాడు సేతురాజు.

“ఆ నాంపల్లి స్టేషన్‌లో అలాగే చెప్తారు బిడ్డా…. అక్కడ రోజూ ఒకళ్ళే ఉండరు కదా… రకరకాల వ్యక్తులుంటారు. నాంపల్లి స్టేషన్‌లోని వాళ్ళకి, కాచిగూడ స్టేషన్ వాళ్ళకి ఒక్కక్షణం పడి చావదు. అందుకే అలా అబద్ధం చెబుతారు. ఎవరేది చెప్పినా నమ్మేస్తే ఎలా? నువ్వే చెప్పు…” ముందుకి వంగి తన ముఖంలో ముఖం పెట్టి చూస్తూన్న సేతురాజు ముకంలోకి చూస్తూ అడిగాడు ఆటోడ్రైవర్.

“నువ్వే కరెక్టు…. ఒరేయ్ సేతురాజు, పోతురాజు పాపం ఆటో బ్రదర్ మంచివాడురా…” అంటూ మీటర్ వైపు చూసి కెవ్వుమని అరవబోయి, బ్రేవ్‌మని తేల్చాడు. పక్కన వున్న సేతురాజు భుజాన్ని గీకి మీటరు వైపు వేలుని చూపెట్టాడు వీర్రాజు.

“ఆఁ” అంటూ కళ్ళెగరేసాడతను.

“తొంభై రూపాయలా..?” పోతురాజు ఆ మాటను గట్టిగా బైటకే అనేసాడు.

ఆటో నింబోలి అడ్డ దగ్గర ఎడమవైపుకి మలుపు తిప్పి కొంత దూరం పోయాక, సరదాగా గల్లీలనీన తిప్పుతున్నాడు డ్రైవర్.

"పోలీస్‌స్టేషన్‌కి ఎంత దూరమా... రైల్వేస్టేషన్.... చాలా దగ్గరని చెప్పారే?" మళ్ళీ అనుమానం వ్యక్తం చేసాడు పోతురాజు.

"మళ్ళీ మొదటికే వచ్చావా బిడ్డా.... ఒకప్పుడు రెండూ పక్క పక్కనే వుండేవి.... హైదరాబాద్ కార్పొరేషన్ అయిపోయాక, రోడ్లు వెడల్పు చేసారు కదా... అప్పుడు దూరమైపోయాయి."

"అలా చెప్పు మరి.... రీజనింగ్ వుండే ప్రతి విషయాన్నీ మేం నమ్ముతాం... ఏరా?" నవ్వుతూ అన్నాడు సేతురాజు.

ఓ గల్లీలోంచి వచ్చి ఆటో కాచిగూడ రైల్వేస్టేషన్ ముందు ఆగింది.

ముగ్గురూ తలలువంచి బూడిద రంగులో కన్పిస్తున్న బిల్డింగ్‌ను చూసారు.

"స్టేషన్ కాడకు పొమ్మంటే, నిజాం బిల్డింగ్ కాడకు తీసుకొచ్చావేంటి బిడ్డా..." అని అడిగాడు పోతురాజు.

"ఇది నిజాం బిల్డింగ్ కాదు... స్టేషన్... సూట్ కేసుల్ని పట్టుకుని వెళ్తున్న పాసింజరర్లను చూడండి..." సాక్ష్యం చూసాక నమ్మకం కలిగిన వారై ముగ్గురూ కిందకు దిగారు.

అప్పటికి ఆటో మీటరు నూట ఇరవై ఏడు రూపాయాలైంది.

వీర్రాజు సేతురాజు ముఖంలోనికి చూసి జేబులోంచి డబ్బులు తీసాడు. సరిగ్గా ఇరవై ఏడు రూపాయలు.

"మన దగ్గరున్న పైసలియ్యే...." పోతురాజు చెవిలో గుసగుసలాడాడు. అప్పుడు పోతురాజు చిద్విలాసంగా పాతకాలపు సినిమాల్లో సత్యనారారాయణలా నవ్వి, ప్యాంటు వెనక జేబులోంచి హండ్రెడ్ రుపీస్ నోటుని తీసి వీర్రాజు చేతిలో పెట్టాడు.

"కరెక్టుగా సరిపోయింది గదా..." ఆ ఎమౌంట్‌ని ఆటోడ్రైవర్ చేతిలో పెట్టాడు.

ఈ వెర్రి వెంగళప్పల్ని భలే మోసం చేశానుగదా... అన్నట్టుగా ఆటోడ్రైవర్ ఒక చూపు చూసి, ఆ డబ్బును జేబులో పెట్టుకున్నాడు.

టింగురంగా మంటూ ముగ్గరూ కాచిగూడ స్టేషనులోకి అడుగుపెట్టగానే పోతురాజు–

"ఒరే నాంపల్లి స్టేషన్ దగ్గర అసలు పైసలు లేవన్నావ్ గదరా.... కాచిగూడ స్టేషన్ దగ్గర కొచ్చేసరికి పైసలెలా వచ్చాయ్?" ఇద్దరూ ఆతృతగా ప్రశ్నించారు.

పోతురాజు విశ్వరూపం చూపించడానికి సిద్ధమైన లార్డ్ కృష్ణలా మందహాసం చేసి–

“నా మైండ్‌లో తెలివుందని మీరొప్పుకుంటే ఆ పైసలెలా సంపాదించానో చెప్తాను” అన్నాడు.

“ఒప్పుకొన్నాం... సరే చెప్పి తగలడు...” ఇద్దరూ కోరస్‌గా అన్నారు.

పోతురాజు అటూ ఇటూ చూసి పరమ రహస్యంగా చెప్పాడు–

“ఆటో యంగ్ డ్రైవర్ ఉన్నాడా.... ఆడి బ్యాక్ పాకెట్లోంచి కొట్టేశా...” కారపు డబ్బాలో పడ్డ కోతిలో కిచకిచమంటూ నవ్వాడు పోతురాజు.

“హా” మిగతా ఇద్దరూ నోళ్ళు తెరిచారు.

ముప్పై, ముప్పై అయిదేళ్ళ మధ్య వయసుగల సేతురాజు, పోతురాజు, వీర్రాజులు నల్గొండ పక్కనున్న ఒక పల్లెటూరి నుంచి తెలివితేటల్ని నమ్ముకుని, అమ్ముకుని బతకడానికి నెలరోజుల క్రితం ఇంట్లో వాళ్ళకు తెలీకుండా హైదరాబాద్ సిటీ కొచ్చారు.

ఈ హైదరాబాద్‌లో తెలివితేటల్ని అమ్ముకోవడం కుదరదని వారం రోజులు లోపల తెల్సిపోయింది. అప్పట్నించీ తెలివి తేటల్ని నమ్ముకోవడం ప్రారంభించి, ఇరానీ హొటల్లో సర్వర్ ఉద్యోగం దగ్గర్నించి చాలా జాబ్స్ వెలగబెట్టారు. మన వాళ్ళ తెలివితేటలన్నీ, అవతలివాళ్ళకి అతి తెలివితేటలుగా కనబడంతో మీలాంటి మహా తెలివైన వాళ్ళు మా కక్కర్లేదని అందరూ ఛీకొట్టగా, ముగ్గరూ మూడు రోజులపాటు నాంపల్లి స్టేషన్ ప్లాట్‌ఫారమ్మీద గడిపారు, తీవ్రంగా ఆలోచనల చేసారు.

ప్రపంచంలో మనిషి బతకడానికి ప్రధానంగా కావల్సినవి ఏమిటి? అని ముగ్గురిలో పెద్దవాడైన వీర్రాజు ఒక ప్రశ్న వేసాడు ఒకరోజు.

“తిండి... బట్ట....” టక్కున జవాబు చెప్పాడు రెండోవాడు సేతురాజు.

“మకాన్... కూడా...” అని మూడోవాడు పోతురాజు చెప్పాడు.

“అర్జంటుగా ఈ మూడ మనకు కావాలంటే..?”

“డబ్బులుండాలి...”

“మనం తెచ్చుకొన్న పైసలన్నీ అయిపోయాయి కాబట్టి... డబ్బుల్లేవు కాబట్టి.... డబ్బుల్లేకుండా ఈ మూడు సంపాదించాలంటే.... ఏం చేయాలి?” అని ఒక తెలివైన క్వశ్చన్ వేశాడు వీర్రాజు.

“క్యాకరూ...?” మిగతా ఇతర భాషలో ఆ ప్రశ్న వేసుకొని గాఢంగా ఆలోచించడం ప్రారంభించారు.

“ఒకేచోట కూర్చుంటే మనకు ఐడియాలు రావు... అయితే మనం ఈ నాంపల్లిస్టేషన్‌ను మార్చేసి... కాచిగూడ స్టేషన్‌కెళ్ళి తీరుబడిగా ఆలోచిద్దాం...”

“అక్కడ ఆలోచన్లు దొరుకుతాయా....” అన్నాడు పోతురాజు.

“అవును.... అక్కడ చాలామంది... ఆలోచన్లను ప్లాట్ ఫారమ్మీద పారేసి వెళ్ళిపోతార్ట...” చెప్పాడు వీర్రాజు.

“ఛలో.... కాచిగూడ....” ఉత్సాహంగా అరిచాడు సేతురాజు ఎదురుగా ఉన్న ఎర్ర పోస్టర్ మీద హెడ్డింఎ చదివిన ఇన్‌స్పిరేషన్‌తో.

ఇదీ ఫ్లాష్ బ్యాక్....

ఇక కరెంట్ ఎపిసోడ్ లోకొస్తే, ఒకసారి కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్మీద ఆ చివర్నుంచి ఈ చివర వరకూ తిరిగొచ్చి నీరసంగా సిమెంట్ బెంచీ మీద కూర్చుంటూ–

“ఈ హైదరాబాద్‌లో పుకార్లెక్కువరా...” అన్నాడు వీర్రాజు.

“ఏం...?”

“ఈ ప్లాట్‌ఫారమ్మీద ఐడియాలు దొరుకుతాయనుకొన్నామా, అబే... ఏం దొరకవు... ఐడియాలే కాదు... ఇక్కడ పాసింజర్లు కూడా లేరు....”

సరిగ్గా నలభై నిమిషాలు గడిచాయి.

ఏదో గజ్జికుక్క మొరిగినట్టు అరుపు వినబడితే సేతురాజు, పోతురాజు బెదిరిపోయి నలువైపులా చూసారు.

“నేనే.... ఐడియా వచ్చింది...” అన్నాడు వీర్రాజు.

“చెప్పు.....”

“రోటీ, కపడా ఔర్ మకాను మనకు ఫ్రీగా కావాలంటే, మనం ఎంచక్కగా దొంగలుగా మారిపోవాలి...”

“దొంగలు... అంటే.... చోర్...”

“ఎస్... మనం దొంగతనం చేస్తామన్నమాట... పోలీసులకు దొరికి పోతాం.... పోలీసులు మనల్ని జైల్లో పెడతారు.... జైల్లో మనకి తిండి... బట్ట.... గూడు... ఫ్రీ.”

“ఒరేయ్ నీ మెదడును గాడ్ బ్రహ్మ బంగారంతో చేసుంటాడ్రా!” పొగిడాడు సేతురాజు.

“మనం స్టేషన్‌లో ఏం చోరీ చేస్తాం... ఇక్కడ అస్సలు మానవజాతే లేదు...” పెదవి విరుస్తూ అన్నాడు పోతురాజు.

“స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ వుంటాడు...”

“ఆఁ.... వాడి దగ్గరేముంటాయి... టిక్కెట్లు, చిల్లర పైసలూ ఉంటాయి.... వాటిని దొంగతనం చేస్తే మనల్ని తన్ని వదిలిపెట్టేస్తారు తప్పు, జైల్లో పెట్టరు...” విచారంగా అన్నాడు సేతురాజు.

“మనం పెద్ద దొంగతనం చెయ్యాలి... సినిమాలోల్లా... పోలీసులు మనల్ని క్యాచ్ చెయ్యడానికి జీపు తీసుకుని పరిగెత్తాలి.... వాళ్ళకి దొరక్కుండా మనం డబ్బాల మీంచి, మొండి గొడల మీంచి, బజారుల్లో పరుగెత్తాలి...”

“అలా పరిగెడితే మనం ఎలా జైలుకెళ్తాం...?”

“అవును... మనం కొంతదూరం పరుగెత్తి, ఆ తర్వాత ఆగిపోయి పోలీసులకు దొరికిపోతాం... పోలీసులు మనల్ని జైల్లో పెడతారు.... అక్కడ మనం... ఏ పాప్పా.... ఎ పాప్పా.... ఎపాప్పా... అంటూ డ్యూయెట్లు పాడుకుంటూ....”

“ఇడియట్.... అది డ్యూయట్ కాదు... పాయింట్‌కు రండి... మనం ఇప్పుడు ఈ కాచిగూడ స్టేషన్ నుంచి వెళ్ళే ట్రైన్‌లో కెక్కి, ఒక మంచి పాజింజర్‌ని చూసుకొని దొంగతనం చేస్తాం... రైల్లోంచి దూరి పరిగెడతాం... ఆ తర్వాత మిగతా కథ మామూలుగా జరుగుతుంది. కథ కంచికి మనం జైలుకి....”

ముగ్గురూ మరోసారి ఆ ఐడియా గురించి ఫర్‌ఫెక్ట్‌గా థింక్ చేసిన వారై ఉత్సాహంగా లేచి, మరింత ఉత్సాహంగా స్టేషన్ మాస్టర్ రూమ్ వైపు నడిచి ఆయన్ని అడిగారు–

“ఇప్పుడు మద్రాసుగానీ, బెంగుళూరుగానీ వెళ్ళే ట్రైనొస్తుందా...” ఆ ప్రశ్నకు సంతోషంగా వున్న ముఖాన్ని చిరాగ్గా మార్చుకుని స్టేషన్ మాస్టరు ముగ్గురి మొఖాలవైపు చూసి చెప్పాడు.

“ఇక్కడకు లోకల్ ట్రైన్సే వస్తాయి...”

“మద్రాసు, బెంగుళూరు కాకపోతే... లోకల్.... ఏదో ఊరు.... మనకి ట్రైన్ ముఖ్యం... కదరా...” అన్నాడు సేతురాజు.

“ఆ ట్రైన్ ఎన్ని గంటలకి వస్తుందండి...” అడిగాడు వీర్రాజు.

“పదకొండు గంటలకు.... వస్తుంది ఒక ట్రైను...”

“ఈ స్టేషన్‌లో ట్రైయిన్లు టైమ్‌కి వచ్చేస్తాయన్నమాట....” ఆశ్చర్యంగా అన్నాడు సేతురాజు.

“కాదు... ఆ ట్రైను నిన్న పదకొండు గంటలకు రావాల్సింది...” నెమ్మదిగా చెప్పాడు స్టేషన్ మాస్టరు.

అయినా ఆ ముగ్గరూ అక్కడ్నించి కదలలేదు.

రెండు మూడు సార్లు డబ్బు లెక్కపెట్టుకొంటూ తలెత్తి చూసాడు స్టేషన్ మాస్టరు. రూమ్ బయట నేలమీద కూర్చుని తనవైపే కన్నార్పకుండా చూస్తున్న ఆ వ్యక్తిని “చిల్లంగి పెట్టేవాడిలా ఏంటలా చూస్తున్నావ్...” గట్టిగా అడిగాడతను. విచిత్రంగా ఓ నవ్వు నవ్వాడు తప్ప, జవాబు చెప్పలేదు వీర్రాజు.

“మూగవాడివా....?” అని మళ్ళీ అడిగాడు.

“కాదు....”

“మరి ఎందుకలా చూస్తున్నావు... అలాగ చూడకూడదు. వెళ్ళి సిమెంట్ బెంచీ మీద కూర్చో...”

“ఎందుకలా ఉలిక్కిపడతావ్? నీవైపు ఎవడు చూశాడు... నీ వెనక గోడకున్న గడియారం వైపు చూస్తున్నా... ఇంకా ఒక్క నిమిషమే వుంది..” తనలో తను అనుకున్నట్టగా అన్నాడు వీర్రాజు.

“ఒక్క నిమిషమా... దేనికి?” బాంబు పెట్టాడేమో అనే అనుమానంతో భయపడుతూ చూశాడు స్టేషన్ మాస్టర్?

ఒక్క నిమిషం అయిపోగానే గోడ గడియారం పదకొండు గంటలు కొట్టడం, సరిగ్గా అదే టైమ్‌కి ట్రైన్ టంచన్‌గా పెద్ద చప్పుడు చేసుకొని రావడం, ముగ్గురూ ముందుకు పరుగెత్తడం జరిగిపోయింది.

“ఒరేయ్... ఇది ప్యాసింజరు బండి కాదురా, గూడ్సు బండి...” ముఖం అదోలా పెడుతూ అన్నాడు పోతురాజు.

“ఆ స్టేషన్ మాస్టరు మన్ని మోసం చేసాడు... ఆడ్ని మనం దెబ్బతియ్యాలి...” ఉక్రోషంగా స్టేషన్ మాస్టరు వైపు చూస్తూ అన్నాడు వీర్రాజు.

“దెబ్బతియ్యాలే... పొడవాలే... నరకాలే కాదు... ట్రైన్ ప్రోగ్రామ్ మిస్సయింది గదా... జర రెండో ప్రోగ్రామ్ సోచాయించండీ... మనం అర్జంటుగా జైలెకెళ్ళాలి...” తీవ్రంగా ఆలోచిస్తూ అన్నాడు సేతురాజు.

“అయిడియా...” కెవ్వుమనకుండా అన్నాడు వీర్రాజు.

“ప్రతిసారీ అయిడియా అని అనక్కర్లే... చెప్పి తగలడొచ్చు...” తీరుబడిగా బీడి తీసి వెలిగిస్తూ అన్నాడు జక్కన్న.

రెండు నిమిషాల్లో ఐడియానంతా చెప్పేశాడు వీర్రాజు.

“మనల్ని జైలుకి తీసుకెళ్ళడానికి ఇక్కడెక్కడా రైల్వే పోలీసులు లేరు కదా...” డౌటును వ్యక్తం చేసాడు సేతురాజు.

“కాసేపు నీ డౌట్లు కట్టెయ్... లేకపోఏత నీ మూతిని కుట్టేస్తాను...” గట్టిగా కసిరి ముందుకు అడుగేస్తూ “ఫాలో మీ!” అన్నాడు వీర్రాజు.

దిష్టిబొమ్మల్లా నుంచున్న ముగ్గురి వైపూ పటకాయించి చూస్తూ అడిగాడు స్టేషన్ మాస్టర్?

“ఏం కావాలి.”

“టిక్కెట్లు...” చెప్తూ సగం తెరచిన టేబుల్ డ్రాయర్లోంచి కనబడుతున్న నోట్ల కట్టవైపు చూస్తున్నాడు పోతురాజు.

"ఎక్కడికి?"

"శంషాబాద్..."

"పక్కన వున్న శంషాబాద్‌కి ఇంత హడావుడంటయ్యా?"

"పోనీ, ఔరంగాబాద్ కివ్వు..."

"ఔరంగా.... బాద్...కా....?" గుడ్లు తేలవేస్తూ అన్నాడు స్టేషన్ మాస్టర్?

సీట్లోంచి లేచి కిటికీ పక్కనున్న టికెట్స్ సెల్‌వైపు వెళ్ళి మూడు టిక్కెట్లను తీసి వెనక్కొచ్చి- "డబ్బులివ్వండి" అన్నాడు స్టేషన్ మాస్టర్. సేతురాజు, వీర్రాజు ఇద్దరూ గుడ్లు తేలేసారు.

కిచ కిచమని నవ్వుతూ అరచేయి గుప్పిట తెరిచాడు పోతురాజు.

అయిదు వందల రూపాయల నోటు అందులో ప్రత్యక్షమైంది.

ఫైవ్ హండ్రెడ్ రుపీస్... ఎక్కడిదని కప్పలా నోరు తెరిచి అడగబోతుండగా ఒక చేత్తో వాడి నోరు మూసేసాడు పోతురాజు.

స్టేషన్ మాస్టర్ ఆ నోటుని తీసుకొని పరకాయించి చూసి- "నో ఛేంజ్..." అన్నాడు.

"ఏం ఫర్వాలేదు... బ్యాలెన్స్ నువ్వు తీసుకో... ఇలా బ్యాలెన్స్ దానాలు చేయడ మా హాబీ..." ఆ టిక్కట్లను అందుకొని ముందుకు నడిచాడు పోతురాజు.

సంభ్రమాశ్చర్య వదనులై మిగతా ముగ్గురూ పోతురాజుని పక్కకులాగి- "ఒక్కసారిగా ఫైవ్ హండ్రెడ్స్ ఎక్కడివిరా...?" కంగారుగా అడిగారు.

"ఒరే పిచ్చి నాన్నలూ... మనీ సంపాదించడం ఒక ఆర్ట్.... ఒక ఫైవ్ హండ్రెడ్స్ ఏంటి.... ఇప్పుడు మన దగ్గర చాలా ఫైవ్ హండ్రెడ్స్ వున్నాయి" అంటూ బ్యాక్ పాకెట్‌లోంచి అయిదు వందల రూపాయల కట్టను తీసి వాళ్ళ కళ్ళముందు ఆడించాడు.

సరిగ్గా అదే సమయంలో-

'ముగ్గుర్లో ఆ టిక్కెట్లు తీసుకొన్నవాడు మరీ పిచ్చివాడు... లేకపోతే బ్యాలెన్స్ ఎందుకు వదిలేస్తాడూ... ఒరే రామప్పా.... నీకీ టైమ్‌లో ధనయోగాన్ని నుదుట మీద రాసాడు ఆ గాడ్!' అని స్వగతానంద లహరిలో అనుకొంటూ డ్రాయర్ సొరుగు కొంచెం ముందుకు లాగి తేలుకుట్టిన వాడిలా "అమ్మో!" అన్నాడు.

ఆ అమ్మోకి కారణం... అంతకు పూర్వమే అతగాడు అక్కడ అయిదువందల రూపాయల నోట్ల కట్టను ఉంచటమే!

కిందా మీదా పడుతూ వెతకడం ప్రారంభించాడు.

అయిదు నిమిషాలసేపు వెతికేసరికి వాషింగ్ మిషన్లో పడేసిన బట్టలా అయిపోయాడు స్టేషన్ మాస్టర్.

"చోర్.... చోర్.... పకడో.... పకడో...." అంటూ బయటకు పరుగుదీయబోయి, ఎదురుగా యూనిఫాంలో వున్న మనిషిని ఢీకొన్నాడు.

"ఏమైంది రామప్పా?" అడిగాడు ఆ యూనిఫాంలో వున్న రైల్వే పోలీస్ సబ్ఇన్స్పెక్టర్?

"దొంగలండీ బాబూ... అర్జంటుగా పట్టుకోండి! అదిగో.... వాళ్ళే!" దూరంగా బెంచీ మీద తీరుబడిగా కూర్చుని బీడీలు కాల్చుకుంటున్న ముగ్గుర్నీ చూపిస్తూ అన్నాడు రామప్ప.

"ఆర్యూ ఘార్.... ఎంత ఎమౌంట్... ఎలా పోయింది?" ఆ ఇన్స్పెక్టర్ చేతిని పట్టుకుని ముందుకు పరిగెడుతూ కథంతా చెప్పాడు స్టేషన్ మాస్టర్.

మూడు నిమిషాల తర్వాత-

తమ ఎదురుగా నిలబడిన ఆ ఇన్స్పెక్టర్ వేపు చూస్తూ పోతురాజు- "ఉయార్ అండర్ అరెస్ట్. అవునా?" అని అన్నాడు. ఆ ఇన్స్పెక్టర్కి మతిపోయినంత పనైంది ఆ డైలాగ్కి.

"అరెస్టా.... తోలు వలిచేస్తాను. మర్యాదగా చెప్పండి. స్టేషన్ రూమ్ టేబుల్లోని యాభై వేల రూపాయల్ని తీసింది మీరేనా?"

"చెప్పకపోతే ఏం చేస్తారో?" ఠీవిగా పొగ వదుల్తూ అన్నాడు వీర్రాజు.

"స్టేషన్లో పడుస్తా. లాఠీల్తో కుళ్ళబొడుస్తా. కోర్టుకి ప్రొడ్యూస్ చేస్తా. ఆరు వారాలు జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. జాగ్రత్త!" అగ్గిరాముడి టైపులో అన్నాడు ఇన్స్పెక్టర్?

"ఇంతేనా- ఆరు వారాలేనా? అదికాదు ఇన్స్పెక్ట్రూ.... ఇప్పుడు నిన్ను మేం కొట్టేసి పారిపోయామే అనుకో- శిక్ష ఎంత?"

"అయిదు నెలలు!"

"ఆరు వారాలకంటే, అయిదు నెలలు ఎక్కువే కదరా! ఒరేయ్ మరెందుకూ లాగించెయ్!" కన్నుకొట్టి వీర్రాజు, సేతురాజుకు సలహా ఇవ్వడంతో, సేతురాజు రెప్పపాటు టైమ్లో ఫట్మని ఇన్స్పెక్టర్చెంప మీద కొట్టి ముందుకు పరుగెత్తాడు.

ఇన్స్పెక్టర్ టోపీ కిందపడిపోయింది. ఆ టోపీని అందుకొని ముందుకురికాడు.

స్టేషన్ బయటికి పరుగెత్తి, అటూ ఇటూ చూసి ముందుకు పరుగెత్తాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Gods+Screen+Play**

* * *